# అక్కరకు రాని విద్యలు

ఉన్నవ విజయలక్ష్మి

"ఎన్నిసార్లు చెప్పిస్తావమ్మా నాచేత? ఏది ఏమైనాసరే, నేనుద్యోగం చేయదల్చుకో లేదు ఎందుకు పదేపదే విసిగిస్తావు?'' అన్నాడు సురేంద్రుడు

"కారణమంటూ వుండాలిగదరా-'ఉద్యోగం పురుష లక్షణం' అన్నారు అట్లాంటివాడివి ఆగ్రాదాకా ఎందుకుపోయి చదివినట్టు? బాబూ ఆలోచించు. నిక్షేపంలాంటి వుద్యోగం దొరుకు తుంది. ఫస్టుక్లాసులో పాసయితివి కూర్చుని తింటే కులగిరులుకూడా కరిగిపోతాయి రేపో మాపో యింటివాడవుతావు నీ స్వంతం అనేది వుంటేనే నీకు స్వాతంత్ర్యం. చదువుకున్నావు.నే చెప్పేదే ముంది?'' అన్నది తల్లి.

సురేంద్రుడు పలకలేదు

"నోరు విప్పవేంరా! మనింట్లో పిల్లాపిచ్చుకా కూడా లేరు కాలక్షేపానికి ఒంటరివాడివి గోళ్లు గిల్లుకుంటూ యింట్లో కూర్చుంటే నీకు మాత్ర మెలా తోస్తుందిరా'' విసుగులేకుండా విసిగి స్తోంది తల్లి

"గోళ్లు గిల్లుకునే ఖర్మ వాడికేం? క్లబ్బుల్లో టెన్నిస్ కోర్టులున్నాయి. ప్రొద్దుగూకితే సినిమా లున్నాయి. మహరాజు! బాబు. సంపాదించి నిలవేస్తే వాడికి కాలక్షేపానికేమి కొదవ?'' వ్యంగ్యోక్తులు పలికాడు; గది అవతలనుంచి తండ్రి.

కళ్లనీళ్లు కొంగునొత్తుకుని "చెప్పవేంరా బాబూ'' అంది తల్లి ఆశ వదులుకోలేక

తండ్రి మాటలకు ముఖమంతా ఎరుపుచేసుకున్న ఏకమాత్ర పుత్రుడు "నాబదులు చెప్పారుగా-వినలా?''అని చదువుతున్న పుస్తకం నేల కేసి కొట్టి తలుపు తెరుచుకుని బైటకు వెళ్ళిపోయాడు

* * *

"ఇంటర్వ్యూ తొమ్మిదింటికే నంటిరి ఇంత ఆలస్యమయిందేం! రండి వడ్డిస్తాను'' వుద్యో గార్థియై వరుసగా ఇంటర్వ్యూలకు హాజరయ్యే ఒక యువకుని, ఒకానొక మిట్టమధ్యాహ్నపు వేళ పలుకరించింది ఓ క్రొత్త యిల్లాలు

"ఒకరా, యిద్దరా - వున్న మూడు ఖాళీల కోసం నలభైమందిని పిల్చారు'' భార్య ఆశలు పెంచుకుంటుందేమోనని, చిన్న వార్నింగ్ మాటల్లోనే అందిచ్చాడు భర్త.

"అయితే మనకొచ్చినట్టే అదృష్టం అన్నింటా అట్లాగే వుంది'' జోస్యం చెప్పింది తల్లి. కోడలు పిల్లకు కళ్ళ నీళ్ళు తిరిగాయి.

"పోని నేను దేనికైనా దరఖాస్తు చేయనా? మగవాళ్లకంటే ఆడవాళ్లకు వుద్యోగాలు తొంద రగా దొరుకుతాయంటారు కనీసం మీకేదైనా దొరికేవరకైనా....'' పూర్తిచేయలేదు భార్య

తింటున్న పళ్లెంలో నీళ్ళుపోసి నిల్చున్నాడు భర్త. భార్య నివ్వెరపోయి చూచింది

"మీ నాన్న నీకు చదువు చెప్పించాడని తెలుసు నాకు కాని నేను నీ చదువును చూచి నిన్ను చేసుకోలేదు. జాగ్రత్తగా మాట్లాడు'' గర్జించాడు భర్త. ఆ అమ్మాయి ఆ పూట అన్నం తినలేదు.

* * *

స్కెచ్

"లక్ష్మి, లక్ష్మి'' హాల్లోకి వచ్చి పిలి చింది కాంతం. 'వస్తున్నా వదినా' అంటూనే వుంది లక్ష్మి - ఇంతలోనే కాంతం వంట గదిలోకి వచ్చేసింది

"ఇక్కడ పొగ వదినా, అక్కడే కూర్చో లేకపోయావూ! పనంతా అయింది. అన్నం వార్చి వచ్చేస్తా" అన్నది లక్ష్మి

"ఫరవాలేదులే. ఐనా ఆడదానికి పొగ బెదురేమిటి" అన్నది కాంతం, లక్ష్మి అందించిన పీట వాల్చుకుంటూనే. లక్ష్మి అదీ యిదీ సర్ది అన్నం వారుస్తోంది. అటు యిటు చూస్తున్న కాంతం దృష్టి తాలింపు డబ్బామీదున్న త్యాగరాయ కృతుల పుస్తకంమీద నిల్చింది.

"యిదేమిటి లక్ష్మీ, నీ సంగీతం కూడా వంటింటి సంగీతం అయిందేమిటి?" అన్నది కాంతం

"నా ప్రత్యేకతేమిటి వదినా? మీతోపాటే నేనూ" నవ్వింది లక్ష్మి.

"నాదేముంది వానాకాలపు సంగీతం, నీ కంటే మీ తాతగారు పట్టుదలతో ఆరేళ్లు నేర్పించిరి సంగీతం. ఎప్పుడూ పాడుకోవూ" అనడిగింది కాంతం.

"అయ్యో, పాడుకోవాలి యింకా! మొన్న ఒక రోజు నేమైందో తెలుసా, వారేదో పేపరు చూస్తున్నారు. జయ లెక్కలు చేసుకుంటోంది. నేను కేదారంలో ఒక కృతి సన్నగా పాడుకుంటున్నా పుస్తకం చూసి వారు వున్నట్టుండి 'జయా! లెక్కలు తర్వాత చేసుకుందువు గానిలే, మీ అమ్మ సంగీతం విను రేపటినుంచి మీ అమ్మ ఎక్కడైనా కచ్చేరికి వెళ్తే, నేను వెనక తంబుర తీసి కెళ్ళాలి కాబోలు అరె నవ్వుతావు దేనికి!' అన్నారు కూతురుతో. నవ్వులకే అనుకో! ఇంకేం పాడుకోమంటావు చెప్పు" అంది లక్ష్మి.

"ఏమో చూస్తుంటే నీకు నవ్వులుగానే వున్నట్టుంది, కాని అంత పాటా కర్పూరంలా హరించుకుపోతుంటే నాకు వుసూరు మనిపిస్తోంది. మీ తాతకు చెప్తే మూడు రోజులన్నం తినరు" అన్నది కాంతం.

* * *

"ఏమోయి మీ స్నేహితుడు కృష్ణమూర్తి సంగతేమిటి, ఏమైనా బాగుపడ్డాడా?" శివయ్య కొడుకు నడిగాడు.

"ఏం లేదండి నాన్నగారు- ప్రాక్టీసు బొత్తిగా పోయింది. ఒక్క పేషెంటు కూడా ఆ వైపు తొంగి చూడ్డంలేదు" అన్నాడు సుందరం.

"ఎంత మంచి ప్రాక్టీసు? ప్రయోజకుడయ్యాడని ఎంతగా సంతోషించాం? ఎంతలో-చేతులారా పాడుచేసుకున్నాడు, నిర్భాగ్యుడు" అన్నాడు శివయ్య.

"అఁ....అయినా డాక్టరుకు తాగుడలవాటేమిటి? ఎవరైనా దడుస్తారు అట్లాంటి వాడి దగ్గరకు పోవటానికి! చదువుకోగానే సరా? సంస్కారం, ప్రవర్తనలో కన్పించకపోతే మనిషికి, పశువుకు తేడా ఏమిటి?" అన్నది శివయ్య భార్య

* * *

"ఔను గాని సరళ మరీ యిట్లా తయారవుతూందేం? మొన్న క్లబ్బు కెళ్ళేముందు వాళ్లింటి కెళ్లాను. సరళ స్నానాని కెళ్ళింది. ఇంతలో వాళ్ళత్తగారొచ్చి నా దగ్గర ఏమీటేమిటో చెప్పుకుని ఏడ్చింది. చెప్పద్దూ, సరళ ఎక్కడ వచ్చేస్తుందో అని భయపడిపోయాను," అన్నది విమల

"ఇప్పుడు తెలిసిందా నీకు? అయినా ఆ యింట్లో ఏది తీరుగా వుందని అత్తకు, కోడలుకు పొత్తులేదంటావు? అబ్బా, ఆ యిల్లు యిల్లేమిటి. పిల్లలు మాత్రం ఎంత మురికిగా వుంటారు? క్లబ్బులో ఏం నవ్వుతుందో? ఇంట్లో అందరిని కసరటమే గద" అన్నది సావిత్రి.

"ఏమిటో బి. ఏ వరకు చదివింది. ఇల్లు దిద్దుకోను చేతకాదంటే ఏం చెప్తాం?" నిట్టూర్చింది విమల

* * *

ఎవరి కే రకమైన విద్య కావాలో, చదువులెవరికి ఎంతెంతవరకు కావాలో నిర్ణయించుకో లేనంతవరకు "ఎందు కొచ్చిన చదువులు" అనే నిరసన వాక్యం వినవలసే వస్తుంది. సంస్కారపు విలువలు ప్రవర్తనలో ప్రతిబింబించనంతవరకు 'చదువుకోగానే సరా' అన్న జనోక్తి పోదు. ★